TELUGU & ENGLISH డిజిటల్ మీడియా | FAST NEWS | VIDEO NEWS | e-PAPER | DIGITAL SERVICES | 24/7

టీ-మీడియా

సామాజికం ... ప్రజల పక్షం ... 24/7 ప్రజా సేవలో...

వార్తలు | వీడియోలు | ఫోటోలు | ఇంటర్వ్యూలు | ప్రజా సమస్యలు | ప్రత్యేక కథనాలు | విశ్లేషణలు

epaper,www.tmedia.net.in | YouTube | facebook

గురువారం 29/10/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

అర్నబ్ విధ్వంసం - రైతులను ముంచిన తుపాను



2లో

ఏపీకి అండగా నిలిచిన తెలంగాణ ప్రభుత్వం



⏭ విద్యుత్ పునరుద్ధరణకు అవసరమైన సిబ్బందిని, సామగ్రి

టీ మీడియా ,అక్టోబర్ 28 ,అమరావతి బ్యూరో :

అర్నబ్ తుపాన్ వేళ ఏపీకి అండగా నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికి తెలంగాణ విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఫోన్ చేసి తుపాన్ తీవ్రత, జరిగిన నష్టంపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన చేపట్టిన నష్ట నివారణ చర్యలు, ఇప్పటివరకు జరిగిన నష్టం, విద్యుత్ పునరుద్ధరణ పనుల గురించి గొట్టిపాటి వివరించారు. విద్యుత్ పునరుద్ధరణకు అవసరమైన సిబ్బందిని, సామగ్రిని పంపేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కష్టకాలంలో ఏపీకి మద్దతుగా నిలిచేందుకు ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి మంత్రి గొట్టిపాటి రవి ధన్యవాదాలు తెలిపారు.

ఏపీలో అర్నబ్ తుపాను బీభత్సం సృష్టిస్తోంది. ఎడతెరపి లేకుండా కురుస్తోన్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. తుపాను కారణంగా రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో వందలాది గ్రామాలు అంధకారంలో ఉన్నాయి.

విద్యుత్ శాఖపై అధికారులతో సమీక్ష : అర్నబ్ తుపాను ఎఫెక్ట్?పై మంత్రి గొట్టిపాటి విద్యుత్ శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. 'ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థ దెబ్బతింది. పరిస్థితిని అర్థంచేసుకుని ప్రజలు సహకరించాలి. 883 ఫీడర్లకు 391 ఫీడర్లు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల ప్రమాదాల నివారణకు ముందస్తుగా విద్యుత్ సరఫరా నిలిపివేశాం. వర్షాలు పడేచోట విద్యుత్ పునరుద్ధరణ పనులకు ఆటంకం ఉంది. పరిస్థితి అనుకూలించగానే విద్యుత్ పునరుద్ధరణకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ఎక్కడైనా వైర్లు తెగిపడినట్లు కనిపిస్తే 1912 కు ఫిర్యాదు చేయాలి. చెట్లుపడి దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించే పనిలో సిబ్బంది ఉన్నారు' మంత్రి గొట్టిపాటి తెలిపారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు అర్నబ్ తుపాను డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాను అతలాకుతలం చేసింది. జిల్లా వ్యాప్తంగా వీచిన ఈదురుగాలులకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వేలాది ఎకరాల్లో వరి, అరటి, కొబ్బరి పంటలు నేలమట్టమయ్యాయి. విద్యుత్, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో తుపాను కారణంగా రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. (మిగతా 2లో)

తెలంగాణలో పలువురు ఐపీఎస్ అధికారుల బదిలీ



⏭ కీలక బాధ్యతల నుంచి జయేశ్ రంజన్‌కు తప్పింపు

టీ మీడియా , అక్టోబర్ 28 హైదరాబాద్ బ్యూరో :

తెలంగాణ రాష్ట్రంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. పరిపాలనా విభాగాల్లో మార్పులు చేస్తూ పలు శాఖలకు కొత్త అధికారులను నియమించింది. సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్‌ను మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుంచి తప్పించి అటవీ, పర్యావరణ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది.హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు మెట్రోపాలిటన్ ఏరియా సెక్రెటరీతో పాటు జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల ప్రత్యేక అధికారి బాధ్యతలను అదనంగా అప్పగించింది.

పంచాయతీరాజ్ శాఖకు నవీన్ మిత్తల్

జయేశ్ రంజన్ అదనపు బాధ్యతల్లో ఉన్న క్రీడలు, హెరిటేజ్ తెలంగాణ శాఖల బాధ్యతలను (మిగతా 2లో)

నీటి నాణ్యతపై రాజీ వద్దు

ట్రీటెడ్ వాటర్ వినియోగంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

టీ మీడియా ,అక్టోబర్ 28 ,హైదరాబాద్ బ్యూరో:

హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటి నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడవద్దని స్పష్టం చేశారు. భవన నిర్మాణాలు, మొక్కల పెంపకం, గార్డెనింగ్, పబ్లిక్ పార్కుల నిర్వహణ, రోడ్ల శుభ్రత వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటిని (ట్రీటెడ్ వాటర్) మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.హైదరాబాద్ క్యూర్ పరిధిలో మంచినీటి సరఫరా, మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీలు) నిర్మాణం, ట్రీటెడ్ వాటర్ వినియోగంపై ముఖ్యమంత్రి ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో నీటి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు.



వంద శాతం సామర్థ్యంతో ఎస్టీపీలు

క్యూర్ పరిధిలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు వంద శాతం సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని సీఎం ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

సచివాలయంతో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో), ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని అవసరాలు, మెట్రో రైలు, ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణకు శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని (మిగతా 2లో)

కల్లాల దగ్గరే కొనుగోళ్లు , తక్షణ చెల్లింపులు

⏭ వరి రైతుల పంట పండుతోంది

టీమీడియా , అక్టోబర్ 28 , హైదరాబాద్ బ్యూరో :

ఈసారి వరి పంట చేతికొచ్చిన రైతుల పంట పండుతోంది. ఎల్‌నినో పరిస్థితుల్లో పండిన వరి పంటకు భారీగా ధర పలుకుతోంది. కోసిన పంటను కోసినట్లుగానే ప్రైవేట్ వ్యాపారులు కల్లాల్లోనే మద్దతు ధర కంటే ఎక్కువ చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఆరబెట్టి, తూర్పార బట్టే పనిలేకుండా, తేమ శాతం, నాణ్యతతో సంబంధం లేకుండా పంటల్ని కొనుగోలు చేయడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కల్లాల దగ్గరే పంటల తూకాలు

రాష్ట్రంలో ఈ ఏడాది ఎల్?నినో కారణంగా వర్షాలు లేక పంటలపై తీవ్ర ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో ఈసారి వరి పండించిన రైతు పంట పండిందనే చెప్పాలి. ఎందుకంటే కోసిన పంటను కోసినట్లుగానే కల్లాల్లోనే కొనుగోలు చేసి, ప్రైవేటు వ్యాపారులు ఎగరేసుకుపోతున్నారు. మద్దతు ధర, బోనస్ కలుపుకుని దక్కే ధర కంటే అధికంగా చెల్లించి కొంటున్నారు.కరీంనగర్ జిల్లాలో 2.65 లక్షలు, పెద్దపల్లి జిల్లాలో 2.15 లక్షలు, జగిత్యాల జిల్లాలో 3 లక్షలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో ఈసారి వరి సాగైంది. పంట చేతికి రాగానే వ్యాపారులు పోటీ పడి మరీ కొనుగోలు చేస్తున్నారు. 10 రోజుల కిందట



క్వింటాకు రూ.3,200 వరకూ కొన్నారు. రవాణా ఖర్చులు, హమాలీ ఇవన్నీ రైతులే భరించాలి. ఆ అవసరం లేకుండా వ్యాపారులు ప్రస్తుతం రూ.2,800 వరకు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఆరబెట్టడం, తూర్పారా పట్టడం, హామాలీ ఖర్చులు లేకుండా నేరుగా కల్లాల వద్దే తూకాలు వేసి పచ్చి వడ్లే తీసుకుంటున్నారు.

ప్రభుత్వ ధర కంటే ఎక్కువే

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలంటే నిర్ణీత తేమ శాతం వచ్చే వరకూ ఆరబెట్టాలి. పంట నాణ్యత పరీక్షించాలి. కొనుగోలు కేంద్రం వరకూ

స్పష్టం చేశారు.

సచివాలయంతో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో), ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని అవసరాలు, మెట్రో రైలు, ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణకు శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని (మిగతా 2లో)

అఖిలపక్ష సూచనల మేరకు చర్యలు

⏭ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

టీ మీడియా ,అక్టోబర్ 28 ,హైదరాబాద్ బ్యూరో:

కరవును ఎదుర్కొనేందుకు అఖిలపక్ష సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రకృతి విపత్తును అధిగమించేందుకు సానుకూల, నిర్మాణాత్మక వైఖరితో ముందుకు వెళ్లతామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క (మిగతా 2లో)



ఏపీకి అండగా నిలిచిన తెలంగాణ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

విపరీతమైన ఈదురుగాలుల కారణంగా రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, కొత్తపేట మండలాల్లోని పలు ప్రాంతాల్లో కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. ప్రభుత్వ భవనాల వద్ద ఉన్న చెట్లు భవనాలపై పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో గరిష్ఠ వర్షపాతాలు అర్నబ్ తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో గరిష్ఠ వర్షపాతాలు నమోదయ్యాయి. ఈ మేరకు అధికారులు వెల్లడించారు. విజయనగరం జిల్లా గరివిడిలో 26 సెం.మీ, అనకాపల్లిలో 25 సెం.మీ, శృంగవరపు కోట, వేపాడలో, చీపురుపల్లిలో 25 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం, మెంటాడ (విజయనగరం), ఎలమంచిలి (అనకాపల్లి)లో 24 సెం.మీ, గంట్యాడ (విజయనగరం), రణస్థలం (శ్రీకాకుళం)లో 23 సెం.మీ, గజపతినగరం (విజయనగరం)లో, నెల్లిమర్ల (విజయనగరం), విశాఖ సిటీ, మెరకముడిదాం (విజయనగరం)లో 22 సెం.మీ. విజయనగరంలో 21 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

తెలంగాణలో పలువురు ఐపీఎస్ అధికారుల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

వాణి ప్రసాద్‌కు ప్రభుత్వం అప్పగించింది. ఇప్పటివరకు విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న నవీన్ మిత్తల్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు బదిలీ చేసింది.ఇటీవల రాష్ట్రంలో విద్యుత్ సరఫరా అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవీన్ మిత్తల్‌పై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వెలువడ్డాయి.

విద్యుత్ శాఖకు వికాస్ రాజ్

విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్ రాజ్‌ను ప్రభుత్వం నియమించింది. రోడ్లు, భవనాలు, రవాణా శాఖల కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఇలంబర్తిని నియమించింది. పశుసంవర్ధక శాఖ కార్యదర్శి బాధ్యతలను కూడా ఆయన అదనంగా నిర్వహించనున్నారు.దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న శైలజా రామయ్యర్‌ను రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేసింది.

పలు శాఖల్లో కొత్త నియామకాలు

గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి అదనపు బాధ్యతల నుంచి సబ్యసాచి ఘోష్‌ను తప్పించి, ఆ బాధ్యతలను రాహుల్ బొజ్జాకు అప్పగించింది. మహిళా, శిశు సంక్షేమ శాఖల ప్రత్యేక కార్యదర్శిగా శృతి ఓజాను నియమించింది.వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీని నియమించడంతో పాటు రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ సీఎండీ బాధ్యతలను అదనంగా అప్పగించింది. మహిళా, శిశు సంక్షేమ శాఖల డైరెక్టర్‌గా సంగీత సత్యనారాయణ నియమితులయ్యారు.టీజీ రెడ్కో ఎండీగా ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేశ్ వి. పాటిల్‌కు అదనపు బాధ్యతలు కేటాయించింది.

వీఆర్ఎస్ ఆలోచనలో జయేశ్ రంజన్?

సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఆయన సన్నిహిత వర్గాల సమాచారం ఆధారంగా పీటీఐ వార్తా సంస్థ ఈ విషయాన్ని వెల్లడించినట్లు కథనాలు పేర్కొన్నాయి.992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన జయేశ్ రంజన్ ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.గతంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె. రామకృష్ణారావు పదవీ విరమణ చేసిన సందర్భంలో ఆ స్థానంలో జయేశ్ రంజన్‌ను నియమిస్తారనే ప్రచారం జరిగింది. అయితే అదే 1992 బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజును ప్రభుత్వం ప్రధాన కార్యదర్శిగా నియమించింది.అయితే జయేశ్ రంజన్ వీఆర్ఎస్ నిర్ణయానికి బదిలీనే కారణమా, లేదా ఇతర అంశాలు ఉన్నాయా అన్న దానిపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలి!

● ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా కార్యదర్శి మల్లేష్

టీ మీడియా , అక్టోబర్ 28 ,కూసుమంచి:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని, 2023--24 సంవత్సరానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అల్పాహార బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఖమ్మం జిల్లా కార్యదర్శి గుండెపంగు మల్లేష్ డిమాండ్ చేశారు.రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం కూసుమంచి మండల కేంద్రంలోని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి భీమ్‌రెడ్డి శ్రీనివాసరెడ్డికి మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న వంట బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అందించే అల్పాహార బాధ్యతలను మధ్యాహ్న భోజన కార్మికులకే అప్పగించి, వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కోడిగుడ్లు, గ్యాస్, నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే సరఫరా చేయడంతో పాటు వంట కార్మికులకు గుర్తింపు కార్డులు అందించాలని కోరారు.గ్రామాల్లో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వంట కార్మికులను రాజకీయ కక్షలతో, ఇతర కారణాలను చూపుతూ తొలగిస్తున్నారని మల్లేష్ ఆరోపించారు. ప్రతి విద్యార్థికి రూ.25 మెస్ ఛార్జీలు చెల్లించాలని, ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.10,000 వేతనాన్ని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ కూసుమంచి మండల కార్యదర్శి మండవ కృష్ణకుమారి, సహాయ కార్యదర్శి నూకపొంగు రమణ, నాయకురాళ్లు గోపె లక్ష్మి, భూక్యా శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి

టీ మీడియా,28 అక్టోబర్ పెబ్బేరు:

వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోనిప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్పెషల్ క్యాంపెయిన్ స్వచ్ఛత సఫాయి మే భలైయి సందర్భంగా ఆరోగ్య కేంద్ర ఆవరణ లో క్లీన్ టూ కేర్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ వైద్య సిబ్బందిచే క్లీన్ టూ కేర్ చేయడము జరిగింది నిర్వహించాలని వైద్య సిబ్బందికి చెప్పడము జరిగింది అలాగే ప్రతి ఆశ కార్యకర్త ప్రతి రోజు లెప్రసి సర్వే నిర్వహించాలని అన్నారు సీజనల్ వ్యాధులు మలేరియా డెంగ్యూ చికెన్ గున్యా రాకుండా ప్రతి మంగళ వారం శు క్రవారం రోజు అందరూ డ్రై డే కార్యక్రమం నిర్వహించాలనీ వైద్య సిబ్బందికి చెప్పారు ఈ కార్యక్రమంలో మండల వైద్య అధికారి డాక్టర్ నదియా సదత్ ఆర్ బి ఎస్ కె డాక్టర్ సునీల్ కుమార్ హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ తిరుపతయ్య ఫార్మసిస్ట్ కుమారి ల్యాబ్ టెక్నీషియన్ విక్టర్ రాజు పాల్గొన్నారు.



దరఖాస్తుల స్వీకరణ తాత్కాలికంగా నిలిపివేత

టీ. మీడియా , అక్టోబర్ 28, చింతూరు:

చింతూరు ఐటీడీఏ పరిధిలోని వీఆర్‌పురం, కూనవరం, చింతూరు మండలాల్లో ఆర్ అండ్ ఆర్ (=ఉ=) మూడో జాబితాను ఇటీవల విడుదల చేసినట్లు ప్రాజెక్ట్ అధికారి తెలిపారు.ఆర్ అండ్ ఆర్ మూడో జాబితాకు సంబంధించి ఓటీఎస్ (వన్ టైమ్ సెటిల్మెంట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గత రెండు రోజులుగా సంబంధిత మండలాల్లో కొనసాగుతోందని పేర్కొన్నారు.అయితే, ప్రస్తుతం అర్నాబ్ తుపాను ప్రభావం, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అక్టోబర్ 28 నుంచి 29 వరకు రెండు రోజుల పాటు ఓటీఎస్ దరఖాస్తుల స్వీకరణను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.తుపాను ప్రభావం తగ్గి వాతావరణ పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చిన అనంతరం అక్టోబర్ 30 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను తిరిగి ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు. ఈ తేదీలో ఏవైనా మార్పులు ఉంటే అధికారికంగా తెలియజేస్తామని స్పష్టం చేశారు. వీఆర్‌పురం, కూనవరం, చింతూరు మండలాలకు చెందిన ఆర్ అండ్ ఆర్ మూడో జాబితా లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించి, తుపాను పరిస్థితుల దృష్ట్యా అధికారులకు సహకరించాలని ప్రాజెక్ట్ అధికారి కోరారు.



అర్నబ్ విధ్వంసం రైతులను ముంచిన తుపాను

టీ మీడియా ,అక్టోబర్ 28 ,అమరావతి బ్యూరో :

అర్నబ్ తుపాను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను అతలాకుతలం చేసింది. ఈదురుగాలులు, భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. పలుచోట్ల భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రహదారులపై చెట్లు విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాతావరణ శాఖ అధికారుల ముందస్తు సూచనలతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు పర్యటించి సహాయక చర్యలను సమీక్షించారు.అర్నబ్ తుపాను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రైతులను నిండా ముంచింది. మండపేట నియోజకవర్గంలో పంటలన్నీ తుపాను ధాటికి నేలకొరిగాయి. అర్ధరాత్రి నుంచి వీచిన పెనుగాలుల వల్ల రైతులు నష్టపోయారు. పంటపొలాలన్నీ నీటిపాలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే తీవ్ర కరవుతో ఇబ్బంది పడుతున్న తమకు అర్నబ్ తీవ్రనష్టాన్ని మిగిల్చిందని అన్నదాతలు చెబుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

నీటి నాణ్యతపై రాజీ వద్దు

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. భవన నిర్మాణాల్లో ట్రీటెడ్ వాటర్ వినియోగానికి సంబంధించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.ప్రైవేట్ సంస్థలు ఎస్టీపీలను ఏర్పాటు చేసేందుకు ప్రోత్సాహకర చర్యలు తీసుకోవాలని, డేటా సెంటర్లకు సైతం శుద్ధి చేసిన నీటినే సరఫరా చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఎస్టీపీల నిర్వహణలో సౌర విద్యుత్ వినియోగించే అవకాశాలను పరిశీలించాలని రెడ్కో ఉన్నతాధికారులకు సూచించారు.

ట్రీటెడ్ వాటర్ కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్

శుద్ధి కేంద్రాల్లో అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలను పాటించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతి ఎస్టీపీ వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని, అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కేంద్రాల పనితీరును హైడ్రా ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు.

ట్రీటెడ్ వాటర్ సరఫరా చేసే ట్యాంకర్లను ట్రాక్ చేసేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని, శుద్ధి చేసిన నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. వినియోగదారులకు సులభంగా సేవలు అందించేందుకు ట్రీటెడ్ వాటర్ కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు.

26 ఎస్టీపీల నుంచి గ్రీన్ ట్యాంకర్ల ద్వారా సరఫరా

ఎస్టీపీల నిర్వహణ, ట్రీటెడ్ వాటర్ వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.

ప్రస్తుతం 26 ఎస్టీపీల నుంచి గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా రుసుము మాత్రమే వసూలు చేస్తున్నామని, నీటిని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులు మాణిక్ రాజ్, నవీన్ నికోలస్, సృజన, వినయ్ కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, జితేష్ వి.పాటిల్, రవి, ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్లాల దగ్గరే కొనుగోళ్లు, తక్షణ చెల్లింపులు

(మొదటి పేజీ తరువాయి)

ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అదే జరిగితే మళ్లీ ఐకేపీ కేంద్రాలే ఆధారం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వ్యాపారులతో పాటు నల్గొండ, మిర్యాలగూడ సహా ఆంధ్రా వ్యాపారులు సైతం ఏజెంట్లను నియమించుకుని పంటను కొంటున్నారు. ఎల్‌నినో వల్ల దేశవ్యాప్తంగా ఈసారి వరి దిగుబడి తగ్గిపోవడంతో ధరలు భారీగా పలుకుతున్నాయి. వరి కోతలు ముగిసే వరకూ ఇదే రేటు పలికితే రైతుకు మరింత కలిసివచ్చినట్లే. కానీ వ్యాపారులు కుమ్మక్కై పంట రాకడ పెరిగి ధరలు తగ్గితే మాత్రం మళ్లీ కొనుగోలు కేంద్రాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.

పలువురు అన్నదాతల పరిస్థితి ఆందోళనకరం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంట చేతికందిన రైతుల పరిస్థితి ఆనందంగానే ఉన్నా, సాగునీరు అందక పంటను కాపాడుకోలేని రైతుల పరిస్థితి మాత్రం అగమ్యగోచరంగా మారింది. బోరుబావుల్లోని నీరు పాలమంతా పారడం లేదు. దీంతో వరి ఆలస్యంగా సాగు చేసి, పంట ఇంకా కోతకు రాని రైతుల పరిస్థితి మాత్రం ఆందోళనకరంగానే కొనసాగుతోంది.

అఖిలపక్ష సూచనల మేరకు చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షతన ఎల్‌నినో కారణంగా తెలంగాణలో నెలకొన్న కార్యాచరణపై, కరవు పరిస్థితులను ఎదుర్కొనేదెలా అనే అంశంపై అఖిలపక్ష భేటీలో చర్చించారు.ఉత్తమ్ కుమార్ రెడ్డి కరవు పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం సానుకూల, నిర్మాణాత్మక దృక్పథంతో ముందుకు సాగుతుందని ఉత్తమ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు వ్యక్తం చేసిన ఆందోళనలను ప్రభుత్వం శ్రద్ధగా ఆలకించినట్లు పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర నదీజలాల అంశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను, రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, కరవు పరిస్థితులు, వాటివల్ల ప్రజలు, రైతులపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు.

రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటికి విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, కరువు నివారణకు ముందస్తు చర్యలు వంటి కీలక అంశాలపై అఖిలపక్ష నాయకుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించినట్లు వివరించారు. తదుపరి కార్యాచరణను నిర్ణయించే సమయంలో వారి అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఈ ప్రకృతి విపత్తు కారణంగా ఎదురవుతున్న సవాళ్లను నిర్మాణాత్మక దృక్పథంతో పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

పలు పార్టీల నేతలు హాజరు

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, వాకిటి శ్రీహరి, చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు, ఎల్‌నినో నోడల్ అధికారి రామకృష్ణారావులు హాజరయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేత అంజన్‌కుమార్ యాదవ్, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వినోద్‌కుమార్, ఎల్.రమణ, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీజేపీ ప్రతిపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కొమురయ్య, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ప్రొఫెసర్ సింహాద్రి, వెంకటేశ్వర్లు, ఆర్జేడీ నాయకురాలు శోభ యాదవ్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు శ్రీరామ్ కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు హేమ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన మేడికల్ షాపు



⏭ గడువుకుముందే తెరచిన వైనం

టీ మీడియా, అక్టోబర్ 28 ,పెబ్బేరు:

వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని సుభాష్ చౌక్ లో ఉన్న రాఘవేంద్ర మెడికల్ షాపును డ్రగ్ ఇన్స్పెక్టర్ తనిఖీ చేసి 15 రోజుల పాటు సీజ్ చేశారు రాఘవేంద్ర మెడికల్ షాపు యజమానులు గడువు తీర కముందే 4 రోజుల ముందు నుండే షాపును ఓపెన్ చేసి అమ్మకాలు జరుపుతున్నారు అధికారుల అదేశాలను తుంగలో తొక్కిన యాజమాన్యాన్ని వివరణ అడగగా అధికారుల అనుమతితో నే షాపును నడిపిస్తున్నామని అన్నారు ఈ సంఘటనపై డ్రగ్ ఇన్స్పెక్టర్ ను వివరణ అడగగా మాకు ఎలాంటి సమాచారం లేదు షాపు యజమాన్యాన్ని కనుక్కొంటామని అన్నారు ఈ తెరచాటు నాటకంలో షాపు యజమాన్యం అధికారులు కుమ్మక్కైనట్లు సమాచారం ఈవిషయంపై లో లోపల పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

●అసంపూర్తి రోడ్డుతోనే ప్రమాదాలు:కే.నాగేశ్వరరావు

టీ మీడియా,అక్టోబర్28,సింగరేణి(కారేపల్లి):

ఖమ్మం జిల్లా సింగరేణి మండలం గాదెపాడు గ్రామానికి చెందిన మధ్యబోయిన వెంకటేష్--రమ్య దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని సీపీఎం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు.బుధవారం గాదెపాడు గ్రామంలో నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని దంపతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 18న మంచుకొండ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేష్,రమ్య దంపతులు మృతి చెందడంతో వారి కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయిందన్నారు.ఇద్దరు చిన్నపిల్లలు,వృద్ధ తల్లిదండ్రులను వదిలి కుటుంబానికి ఆధారమైన దంపతులు మృతి చెందడం కలచివేసిందన్నారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయంతో పాటు అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు.ఖమ్మం నుంచి పడితాపురం వరకు రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటంతో తరచూ



ప్రమాదాలు జరుగుతున్నాయని నాగేశ్వరరావు ఆరోపించారు.రెండేళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నా అధికారులు,ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.ఈ రహదారిపై ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు.ప్రస్తుత కాంట్రాక్టర్ను తొలగించి కొత్త కాంట్రాక్టర్ను నియమించి రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు పగడాల నాగరాజు,కాంగ్రెస్ జిల్లా నాయకురాలు పగడాల మంజుల,టీడీపీ నాయకులు పుట్ట ఉపేందర్,సర్పంచ్ భూక్య రంజిత్కుమార్,న్యాయవాది నాగేశ్వరరావు,మచ్చ శ్రీనివాసరావు,నన్నెబోయిన సర్వయ్య,నాన్నబాల మల్లయ్య,మధ్యబోయిన సత్తిబాబు,కేలోత్ సూర్యకుమార్,మేకల రామారావు,నన్నెబోయిన వెంకన్న,పోతర్ల నాగేశ్వరరావు,గడ్డబోయిన ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫూట్ బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక



టీ మీడియా ,అక్టోబర్ 28 ,నారాయణఖేడ్:

రాష్ట్రస్థాయి ఫుట్బాల్ పోటీలకు నారాయణఖేడ్ ఈతక్షిల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపిక అండర్ 14 విభాగంలో కార్తికేయ శివ కైలాష్ రాగప్రియ ఆరోహి . ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట స్టేడియంలో జరిగిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ఎంపికైనట్టు స్కూల్ కరస్పాండెంట్ శరత్ కుమార్, ప్రధానోపాధ్యాయులు సుమ,అవిక శెట్టి,ఇతర అధ్యాపకులు వారిని అభినందించారు. అలాగే విద్యార్థులతో పాటు పిఈటి శ్రీనాథ్ కి అభినందనలు తెలియజేశారు వీరు ఈనెల 29 మేడ్చెల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పంట నష్టానికి పరిహారం చెల్లించాలి

⏭ తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ధర్నా

టీ మీడియా,అక్టోబర్28,సింగరేణి(కారేపల్లి):

వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.కారేపల్లి మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులపై సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.అనంతరం పలు డిమాండ్లతో తహశీల్దార్కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కోలేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేవలం కరువు మండలాలుగా ప్రకటించి సరిపెట్టకుండా,క్షేత్రస్థాయిలో రైతులు,ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు.వర్షాభావంతో పంటలు సాగు చేయని భూములకు ఎకరానికి రూ.30 వేల చొప్పున పరిహారం అందించాలని,ఎండిపోయిన వాణిజ్య పంటలకు



ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.కరువు పరిస్థితుల్లో ప్రజలను ఆదుకునేందుకు రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. బావుల కింద సాగవుతున్న కొద్దిపాటి పంటలను కాపాడేందుకు కోతలు లేకుండా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని,అందుబాటులో ఉన్న నీటి వనరులను రైతాంగానికి మళ్లించి పంటలను కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ర్యూన్సీ,అఖిలభారత ఐక్య రైతు సంఘం ఖమ్మం డివిజన్ కార్యదర్శి గుగ్గులోతు తేజ నాయక్,పార్టీ మండల కార్యదర్శి గుమ్మడి సందీప్,నాయకులు పులకాని సత్తిరెడ్డి,రాకేష్, సక్రు, రంగయ్య, శ్రీను, అనసూయ,సరోజిని తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపైవరుస ప్రమాదాలు



టీ మీడియా, అక్టోబర్ 28 ,కూసుమంచి :

ఖమ్మం బి సూర్యాపేట జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి వరుస ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కూసుమంచి మండలం, జుజ్జులరావుపేట గ్రామ సమీప, ఖమ్మం బి సూర్యాపేట హైవే రోడ్డుపై అన్నపూర్ణ దాబా హోటల్ దగ్గర మంగళవారం రాత్రి ట్రాక్టర్ని, డీసీఎం ఢీ కొట్టిన సంఘటన జరిగింది. ఈ సందర్భంగా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న సమయంలో మరో 2 కంటైనర్లు, ఆయిల్ ట్యాంకర్ ఒకదానికొకటి ఢీకొన్నాయి.ఈ ప్రమాద సంఘటనలో లారీ డ్రైవర్ కి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

చింతూరు అటవీ రేంజ్‌లో పెద్దపులి సంచారం

టీ మీడియా ,అక్టోబర్ 28 ,చింతూరు:

చింతూరు అటవీ రేంజ్ పరిధిలో పెద్దపులి సంచారం గిరిజన గ్రామాల ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. గుల్లేటివాడ గ్రామంలో గిరిజన రైతు వంజం సుబ్బయ్యకు చెందిన రెండు పశువులపై పెద్దపులి దాడి చేయగా, ఒక పశువు మృతి చెందింది. మరో పశువు తీవ్రంగా గాయపడింది.

మూడు రోజుల క్రితం ఏలూరు జిల్లా సరిహద్దులు దాటి గోదావరి నదిని ఈదుకుంటూ పెద్దపులి పోలవరం జిల్లాలోని పాపికొండల అభయారణ్యంలోకి ప్రవేశించినట్లు సమాచారం. అనంతరం ఆచంట నుంచి విఆర్ పురం అటవీ రేంజ్ పరిధిలో సంచరిస్తూ మంగళవారం చింతూరు అటవీ రేంజ్‌లోకి ప్రవేశించినట్లు తెలిసింది.మంగళవారం రాత్రి టేకులూరు ప్రాంతంలో పెద్దపులి ఉన్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. బుధవారం ఉదయం చదలవాడ అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు గుర్తించినట్లు సమాచారం.

అప్రమత్తంగా ఉండాలని కోరుతున్న ప్రజలు

చింతూరు అటవీ రేంజ్ పరిధిలో పెద్దపులి సంచరిస్తుండటంతో గిరిజన గ్రామాల ప్రజలు



ఆందోళన చెందుతున్నారు. పశువులపై దాడి జరగడంతో తమ జీవనోపాధికి నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దపులి ఎప్పుడు, ఎక్కడ కనిపిస్తుందోనని భయపడుతున్నారు.అటవీ అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తూ, ప్రజలకు తగిన సూచనలు అందించాలని స్థానికులు కోరుతున్నారు. అటవీ ప్రాంతాలు, పొలాల వద్దకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, పెద్దపులి కనిపిస్తే దాని దగ్గరకు వెళ్లకుండా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

మెదక్ జిల్లాలో విషాదం..

⏭ కూతుళ్లతో నదిలో దూకి తల్లి ఆత్మహత్య

టీమీడియా , అక్టోబర్ 28 , మెదక్ :

మెదక్ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. మంజీరా నదిలో దూకి తల్లి, ఇద్దరు చిన్నారుల మృతిచెందారు. బుధవారం ఉదయం చిన్న ఘనపూర్ శివారులోని మొదటి బ్రిడ్జి సమీపంలో వారి మృతదేహాలను కొల్చారం పోలీసులు వెలికితీశారు. తల్లితోపాటు ఇద్దరు చిన్నారులు విగతజీవులుగా కనిపించడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. అభం శుభం తెలియని చిన్నారులు ప్రాణాలు కోల్పోవడంతో స్థానికులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన గంగోల్ల సరిత (27)కు ఇద్దరు కుమార్తెలు వైష్ణవి (7), సాన్విక (6) ఉన్నారు. సరిత భర్త గతంలోనే మృతి చెందాడు. దీంతో కుటుంబ బాధ్యతలు ఆమెపై పడ్డాయి. పిల్లలను తల్లిగారి ఇంట్లో ఉంచి, హైదరాబాద్‌లో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ జీవనం సాగించేది. అప్పుడప్పుడు స్వగ్రామానికి వచ్చి పిల్లలను చూసి తిరిగి వెళ్లేది. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సరిత.. పిల్లలను తాను పనిచేసే చోట ఉంచుకోలేక, మరోచోట వదిలి వెళ్లాల్సి రావడంపై మనోవేదనకు గురైనట్లు బంధువులు తెలిపారు. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో తీవ్ర ఒత్తిడికి లోనైనట్లు పేర్కొన్నారు.ఆధార్ కార్డులో సవరణ చేయించుకోవాలని చెప్పి సరిత తన తల్లి వద్ద ఉన్న ఇద్దరు కుమార్తెలను తీసుకెళ్లినట్లు బంధువులు తెలిపారు. అనంతరం ఏడుపాయలకు చేరుకున్న ఆమె.. పిల్లలతో కలిసి మంజీరా నదిలోకి వెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో ముగ్గురూ గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు నదిలో గాలింపు చేపట్టి బుధవారం మృతదేహాలను వెలికితీశారు.కొల్చారం ఎస్ఐ మయినుద్దీన్ మృతదేహాలకు పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మెదక్



ఏరియా ఆసుపత్రికి తరలించారు. బంధువుల చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు

హైవే పక్కన రాత్రివేళ మట్టి తవ్వకాలు?

⏭ రైతుల భూముల్లో గుంతలు..

⏭ ఉదయానికి రాళ్లతో పూడ్చివేత!

టీ మీడియా ,ఖమ్మం రూరల్ ,అక్టోబర్ 28:

ఖమ్మం రూరల్ మండలంలోని పొన్నేకల్ నుంచి కొరవి వరకు నిర్మాణంలో ఉన్న ఎన్‌హెచ్ఏఐ హైవే పక్కన రైతుల భూముల్లో రాత్రివేళ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. రాత్రి సమయంలో భూముల్లో గుంతలు తవ్వి, ఉదయానికి వాటిని రాళ్లతో పూడ్చివేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది.

అనుమతులు ఉన్నాయా?

రైతుల భూముల్లో తవ్వకాలు చేపట్టేందుకు భూయజమానుల అనుమతులు తీసుకున్నారా? మట్టి, రాళ్ల తవ్వకం, తరలింపునకు సంబంధిత శాఖల నుంచి అధికారిక అనుమతులు ఉన్నాయా? తవ్విన మట్టి, రాళ్ల పరిమాణం, వాటి వినియోగం, తరలింపు వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

హైవే నిర్మాణ పనుల్లో పారదర్శకత ఏదీ?

జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు, భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఈ నేపథ్యంలో హైవే పక్కన జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న తవ్వకాలు, గుంతల పూడ్చివేత పనులపై సమగ్ర పరిశీలన



అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. తవ్వకాల వల్ల రైతుల భూములకు నష్టం వాటిల్లితే బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారులు స్పందించాలి

మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. తవ్వకాలకు సంబంధించిన అనుమతులు, భూముల యాజమాన్య వివరాలు, మట్టి తరలింపు, గుంతల పూడ్చివేత విధానంపై పరిశీలన జరపాలని డిమాండ్ చేస్తున్నారు.నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, రైతుల భూములకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి తగిన న్యాయం చేయాలని కోరుతున్నారు.

'ప్రజల మనిషి పొంగులేటి': ఇమ్మడి తిరుపతిరావు



టీ మీడియా,అక్టోబర్28,సింగరేణి(కారేపల్లి):

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను సింగరేణి మండల కాంగ్రెస్ నాయకులు కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు.నాయకులు,కార్యకర్తలు కేక్ కట్ చేసి పొంగులేటికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.రెవెన్యూ,హౌసింగ్ శాఖల మంత్రిగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని తెలిపారు.కార్యకర్తలకు సమస్య వస్తే వెంటనే స్పందించే నాయకుడు పొంగులేటి అని,ఆయన మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాశ్,మల్లెల నాగేశ్వరరావు,మాదారం మాజీ సర్పంచ్ అజ్మీరా నరేష్ నాయక్,తోగర శ్రీను,దూడ అర్జున్‌రావు,ఆదేర్ల రామారావు,పేరుపల్లి సర్పంచ్ బానోతు వీరభద్రం,పప్పుల నిర్మల, ఎం.మల్లేష్, ఎం.సుధాకర్,బండారి నాగేశ్వరరావు, కె.బాలకృష్ణ, తురక రాంబాబు, చారి,వెంకట్,కొరివి వీరన్న, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును పరిరక్షించడమే లక్ష్యం

⏭ జిల్లా ఎలక్టోరల్ రోల్

అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన

టీ మీడియా ,అక్టోబర్ 28 ,కూసుమంచి:

అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన తెలిపారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని అధికారులకు సూచించారు.బుధవారం కూసుమంచి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి ఈఆర్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ దేవసేన మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన ఘట్టమని పేర్కొన్నారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి అందిన ఫారం–6, ఫారం–6ఏ, ఫారం–7, ఫారం–8 దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. ఎన్నారై ఓటర్ల నుంచి వచ్చిన దరఖాస్తులను కూడా నిబంధనల మేరకు పరిశీలించాలన్నారు.

బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ప్రతి



ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని, పరిశీలనలో గుర్తించిన మార్పులను ఓటర్ల జాబితాలో సరిచేయాలని ఆదేశించారు. ఓటర్ల డేటాబేస్‌లో గుర్తించిన మార్క్‌డ్ ఓటర్ల వివరాలను పరిశీలించడంతో పాటు, అత్యధికంగా ఓటర్ల చేర్పులు, తొలగింపులు జరిగిన ప్రతి నియోజకవర్గంలోని 20 పోలింగ్ కేంద్రాలను పునఃపరిశీలించాలని సూచించారు.ఈ సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఎస్డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, కూసుమంచి తహసీల్దార్ సైదులు, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచంద్ర, ఎన్నికల డీటీ అన్సారీ, నాయబ్ తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి కృష్ణా జిల్లాపై అర్నబ్ తుపాను ప్రభావం



⏭ ప్రధాన రహదారులపై కూలిన భారీ వృక్షాలు

టీ మీడియా , అక్టోబర్ 28, అమరావతి బ్యూరో:

ఆంధ్రప్రదేశ్‌పై అర్నబ్ తుపాను ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తుండటంతో జనజీవనం స్తంభించింది. పలుచోట్ల భారీ వృక్షాలు నేలకొరిగి ప్రధాన రహదారులపై పడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సముద్ర తీర ప్రాంతాల్లో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

మచిలీపట్నంలో తీవ్ర ప్రభావం

కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో తుపాను ప్రభావం అధికంగా కనిపించింది. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం పరిసరాలు, ఆర్ అండ్ బీ అతిథి గృహం, కలెక్టర్ బంగ్లా సమీప ప్రాంతాలు, లక్ష్మీ టాకీస్ సెంటర్‌తో పాటు పలు ప్రధాన రహదారులపై భారీ వృక్షాలు కూలిపోయాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.భారీ వర్షాలకు రోడ్లపైకి నీరు చేరడంతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. బలమైన గాలులకు ప్రచార హోర్డింగులు, తోపుడు బళ్లు కొట్టుకుపోయాయి. రహదారులపై పడిపోయిన చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు.

మచిలీపట్నం డివిజన్‌లో భారీ వర్షపాతం

తుపాను ప్రభావంతో మచిలీపట్నం డివిజన్‌లో గణనీయమైన వర్షపాతం నమోదైంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, అత్యధికంగా మచిలీపట్నం ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో 10 సెంటీమీటర్లు, కోడూరు మండలంలో 9 సెంటీమీటర్లు, చల్లపల్లి మండలంలో 7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

చల్లపల్లిలో రహదారిపై కూలిన చెట్లు

చల్లపల్లి మండలంలో రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. బలమైన ఈదురుగాలులకు చల్లపల్లి--విజయవాడ రహదారిలో వక్కలగడ్డ సమీపంలో చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి.ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ డి.ఆర్.కే. ప్రసాద్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ వాలంటీర్లు, స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు, స్థానికులు రంగంలోకి దిగారు. సుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ తరిగోపుల పద్మావతి ఆధ్వర్యంలో చెట్లను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ పీవీ మాధవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకాయతిప్ప వద్ద అల్లకల్లోలంగా సముద్రం

అవనిగడ్డ నియోజకవర్గంలోని కోడూరు మండలం పాలకాయతిప్ప వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురుగాలులు కొనసాగుతున్నాయి. సముద్రం సుమారు కిలోమీటరు మేర ముందుకు చొచ్చుకొచ్చిందని స్థానికులు చెబుతున్నారు. ఆరు నుంచి ఏడు మీటర్ల ఎత్తులో అలలు ఎగసిపడుతున్నాయని వారు తెలిపారు.తీర ప్రాంత గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకట్లు అలుముకున్నాయి. సముద్రం ఉధృతంగా ఉండటంతో తీర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పరిస్థితుల నేపథ్యంలో మత్స్యకారులు, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.ఎన్టీఆర్ జిల్లాలోనూ వర్షాలుఅర్నబ్ తుపాను ప్రభావంతో ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, రెడ్డిగూడెం మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు సమాచారం.తుపాను ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని స్థానికులు కోరుతున్నారు.

ఖమ్మం జిల్లాపై 'అర్నబ్' తుపాను ప్రభావం

⏭ జిల్లా వ్యాప్తంగా

మోస్తరు వర్షం..

⏭ రైతుల్లో ఆందోళన

టీ మీడియా ,అక్టోబర్ 28 ,ఖమ్మం రూరల్:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారడంతో దాని ప్రభావం ఖమ్మం జిల్లాపైనా కనిపిస్తోంది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లావ్యాప్తంగా బలమైన ఈదురుగాలులు వీచాయి. గురువారం తెల్లవారుజాము నుంచి తేలికపాటి జల్లులు ప్రారంభమై, ఉదయం 9 గంటల తర్వాత ఖమ్మం నగరంతోపాటు పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది.వర్షం కారణంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు స్వల్ప ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు, చాలా రోజుల తర్వాత వర్షం కురవడంతో జిల్లా ప్రజలు కొంత సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే పంటలు చేతికొచ్చే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

పత్తి, వరి రైతుల్లో కలవరం

జిల్లాలో వానాకాలం సాగులో ప్రధాన పంటలైన పత్తి, వరి ప్రస్తుతం కీలక దశలో ఉన్నాయి. వరి కోతలకు సిద్ధమవుతున్న రైతులు వర్షం తీవ్రత పెరిగితే పంటకు నష్టం వాటిల్లుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాల్లో భారీ వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోయి నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని భయపడుతున్నారు.పత్తి రైతుల పరిస్థితి కూడా ఇంచుమించు ఇదే విధంగా ఉంది. పత్తి ఏరుకునే సమయంలో వర్షాలు కురిస్తే పత్తి నాణ్యత తగ్గడంతోపాటు దిగుబడి, ధరలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు ఎన్ని రోజులు కొనసాగుతాయో తెలియక రైతులు వాతావరణ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నారు.

కొన్ని పంటలకు ప్రయోజనం

మరోవైపు, పంటలకు చివరి తడి అవసరమైన రైతులకు ఈ వర్షం కొంత ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది. వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొన్న పంటలకు తగినంత నీరు అందితే మేలు జరుగుతుందని రైతులు భావిస్తున్నారు. దీంతో వర్షం వల్ల ఒకవైపు



ప్రయోజనం ఉంటుందనే ఆశ ఉన్నప్పటికీ, దెబ్బతింటాయేమోననే భయం వారిని మరోవైపు కోతకు సిద్ధంగా ఉన్న పంటలు వెంటాడుతోంది.

జర్నలిస్టులకు ప్రతిభా పురస్కారాలు

● శనగపాటి అమ్మా నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో
● ఎల్‌నినో పేదల జీవనంపై ప్రభావం అంశంపై కథనాలకు ఆహ్వానం
● నెలకో పాఠశాల సందర్శన.. విద్యార్థులకు పోటీలు, బహుమతులు

టీ మీడియా, అక్టోబర్ 28, ఖమ్మం:
జర్నలిస్టుల ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు శనగపాటి అమ్మా నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సామాజిక, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సీనియర్ జర్నలిస్టు శనగపాటి మురళీకృష్ణ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జర్నలిస్టులకు ఏటా నగదు పురస్కారాలు అందజేయనున్నట్లు వెల్లడించారు.ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఫౌండేషన్ కార్యక్రమాలను వివరించారు. 'ఎల్‌నినో -- పేదల జీవనంపై ప్రభావం' అనే అంశంపై అక్టోబర్ 30 నుంచి నవంబర్ 30 వరకు ప్రచురితమైన కథనాలను అవార్డుల పరిశీలనకు పంపించాలని కోరారు. కథనాలను డిసెంబర్ 10వ తేదీలోగా ఫౌండేషన్‌కు చేరేలా పంపించాలన్నారు.

ప్రింట్, డిజిటల్ మీడియాకు వేర్వేరు పురస్కారాలు

ప్రింట్ మీడియా జర్నలిస్టులు తమ కథనం ప్రచురితమైన పత్రిక క్లిప్పింగ్‌తో పాటు ఆ రోజు పత్రికను జతచేసి పంపించాలని సూచించారు.



డిజిటల్ మీడియా జర్నలిస్టులు కథనంతో పాటు వెబ్‌సైట్ లింక్‌ను సమర్పించాలన్నారు. దరఖాస్తుతో పాటు హామీ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, చిరునామా వివరాలు జతచేయాలని తెలిపారు.పోటీకి వచ్చిన కథనాలను సీనియర్ జర్నలిస్టులు నామా పురుషోత్తం, కనకం సైదులు ఆధ్వర్యంలోని కమిటీ పరిశీలించి విజేతలను ఎంపిక చేస్తుందని చెప్పారు. అవార్డుల ఎంపికలో కమిటీ నిర్ణయమే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. ఎంపికైన జర్నలిస్టులకు 2028 జనవరిలో పురస్కారాలు అందజేయనున్నట్లు వెల్లడించారు.ప్రింట్ మీడియా విభాగంలో ఎంపికైన జర్నలిస్టుకు రూ.5,000 నగదు బహుమతి, డిజిటల్ మీడియా విభాగంలో ఎంపికైన జర్నలిస్టుకు రూ.3,000 నగదు బహుమతితో పాటు మెమెంటో, ప్రశంసాపత్రం అందించి సత్కరించనున్నట్లు తెలిపారు.

కథనాలు పంపాల్సిన చిరునామా

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జర్నలిస్టులు తమ కథనాలను టీ మీడియా కార్యాలయం, ఆర్టీసీ డిపో వెనుక, మామిళ్లగూడెం, ఖమ్మం చిరునామాకు పంపించాలని కోరారు.పూర్తి వివరాలకు 98666 45218, 8919710365 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

నెలకో కవి సమ్మేళనం.. విద్యార్థులకు ప్రోత్సాహం

ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెలా కవి సమ్మేళనం నిర్వహించి వర్ధమాన కవులను ప్రోత్సహించనున్నట్లు మురళీకృష్ణ వెల్లడించారు. ప్రతి నెలా ఒక ప్రభుత్వ లేదా ప్రైవేట్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

.ఈ సమావేశంలో జర్నలిస్టుల అవార్డు కమిటీ కన్వీనర్, సీనియర్ జర్నలిస్టు నామా పురుషోత్తం, ఫౌండేషన్ సభ్యుడు జి. రామారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలో బోణీ కొట్టని కాంగ్రెస్



● కర్ణాటకలో సిట్టింగ్ స్థానంలోనూ పరాజయం

టీమీడియా , అక్టోబర్ 28 , ఢిల్లీ బ్యూరో :
దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాభవాన్ని చవిచూసింది. ఉత్తర్? ప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని 28 శాసన మండలి స్థానాలకు జరిగిన శాసనమండలి ఎన్నికల్లో ఇప్పటివరకు కాంగ్రెస్ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. అధికారంలో ఉన్న కర్ణాటకలో కూడా ఒక్క సీటు సాధించుకోలేకపోయింది. ఈ ఫలితాలు ఆ పార్టీకి అతిపెద్ద ఎదురుదెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు. సిట్టింగ్ స్థానం సహా రాష్ట్రంలోని నాలుగు స్థానాల్లో ఓటమిపాలైంది. మహారాష్ట్రలో 5 స్థానాలకు ఎన్నికలు జరగ్గా కౌంటింగ్ కొనసాగుతోంది. మిగతా రాష్ట్రాల్లో ఎవరేవరు గెరలిచారంటే?

సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయిన కాంగ్రెస్?

కర్ణాటక శాసనమండలి ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎన్నికలు జరిగిన 4 శాసనమండలి స్థానాల్లోనూ కాంగ్రెస్ పరాజయం పాలైంది. బీజేపీ– జీఆ కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. బీజేపీ తన సిట్టింగ్ స్థానాలు మూడింటిని నిలబెట్టుకోగా కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం బెంగళూరు టీచర్స్ నియోజకవర్గాన్ని జేడీఎస్ కైవసం చేసుకుంది. ఈనెల 23న బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ జరగ్గా మంగళ, బుధవారాల్లో ఫలితాలు వెల్లడయ్యాయి. మంత్రులు, పార్టీ సీనియర్ నేతలు ముమ్మరంగా ప్రచారం చేసినప్పటికీ కాంగ్రెస్ ఒక్క సీటూ గెలుచుకోలేకపోయింది. 75స్థానాలున్న కర్ణాటక శాసనమండలిలో కాంగ్రెస్‌కు 38, బీజేపీకి 24, జేడీఎస్‌కు ఆరుగురు సభ్యులున్నారు. ఖాళీగా ఉన్న 5 నామినేటెడ్ స్థానాలను భర్తీ చేస్తే మండలిలో అధికార పార్టీ బలం పెరిగే అవకాశం ఉంది. కాగా 4 స్థానాల్లో ఓటమిపై కర్ణాటక సీఎం డీకే శివకుమార్ స్పందించారు. ఓటర్ల తీర్పును గౌరవిస్తున్నామని, కనీసం ఒకట్రెండు స్థానాలైనా గెలుస్తామని ఆశించినప్పటికీ, అలా జరగలేదని విచారం వ్యక్తం చేశారు. ఈ ఫలితాల ద్వారా ప్రజలు తమకు ఒక సందేశాన్ని ఇచ్చారన్న డీకే, ఎక్కడ తప్పు జరిగిందో లోతుగా విశ్లేషించుకుని, లోపాలను సరిదిద్దుకుంటామని పేర్కొన్నారు.

యూపీలో నాలుగు స్థానాల్లో గెలిచిన బీజేపీ

ఉత్తర్‌ప్రదేశ్‌లో 11 ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ నాలుగు స్థానాలను గెలుచుకోగా, సమాజ్‌వాదీ పార్టీ రెండు స్థానాల్లో విజయం సాధించింది. మిగిలిన స్థానాలకు లెక్కింపు కొనసాగుతోంది. ఐదు గ్రాడ్యుయేట్, ఆరు ఉపాధ్యాయ స్థానాలకు జరిగిన ఈ ఎన్నికలు 2027 అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రతిష్టాత్మకంగా మారాయి. బరేలీ– మొరాదాబాద్ ఉపాధ్యాయ స్థానంలో బీజేపీ అభ్యర్థి హరి సింగ్ ధిల్లాన్ విజయం సాధించగా, లఖ్‌నవూ ఉపాధ్యాయ స్థానాన్ని కూడా బీజేపీ కైవసం చేసుకుంది. మేరఠ్ గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ స్థానాలు రెండింటిలోనూ బీజేపీ అభ్యర్థులు గెలుపొందారు. మరోవైపు వారణాసి ఉపాధ్యాయ స్థానాన్ని ఎస్పీ అభ్యర్థి లాల్ బిహారీ యాదవ్ గెలుచుకోగా, ఆగ్రా–అలీగఢ్ ఉపాధ్యాయ స్థానంలో ఎస్పీ అభ్యర్థి ఆకాశ్ అగర్వాల్ విజయం సాధించారు. అయితే, ఆగ్రాలో కౌంటింగ్ సమయంలో వివాదాలు తలెత్తడం, ఎస్పీ అభ్యర్థిపై దాడి జరిగినట్లు ఆరోపణలు రావడం రాజకీయంగా కలకలం రేపింది. గోరఖ్‌పూర్– ఫైజాబాద్ ఉపాధ్యాయ స్థానంలోనూ ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. మరికొన్ని స్థానాల్లో కౌంటింగ్ కొనసాగుతుండటంతో అధికార బీజేపీ, విపక్ష ఎస్పీ మధ్య తీవ్ర పోటీ నెలకొంది.

బిహార్?లో పీకే పార్టీ బోణీ

బిహార్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్‌కు చెందిన జన్ సురాజ్ పార్టీ బోణీ కొట్టింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి సురేశ్ ప్రసాద్ రాయ్, కాంగ్రెస్ అభ్యర్థిపై 324 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పట్నా పట్టభద్రుల స్థానానికి జరిగిన ఎన్నికల్లో =జీణ అభ్యర్థిపై జేడీయూ నేత నీరజ్ కుమార్ గెలుపొందారు. తిర్‌హుత్‌లో స్వతంత్ర అభ్యర్థి భూషణ్ కుమార్ ఝాపై బీజేపీ అభ్యర్థి నరేంద్ర ప్రసాద్ సింగ్ విజయం సాధించారు. పట్నా ఉపాధ్యాయ స్థానంలో బీజేపీ ఎమ్మెల్సీ నావల్ కిషోర్ యాదవ్‌పై ఆర్జేడీ అభ్యర్థి సంజీవ్ కుమార్ గెలుపొందగా, సారణ్‌లో సిట్టింగ్ ఎమ్మెల్సీ అఫాక్ అహ్మద్‌పై స్వతంత్ర అభ్యర్థి రాహుల్ రాజ్ విజయం సాధించారు. నాలుగు పట్టభద్రుల స్థానాలు, నాలుగు ఉపాధ్యాయ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 60 మంది పోటీ పడ్డారు. ఇంకా కొన్ని స్థానాల్లో ఓట్ల లెక్కింపు కొనసాగుతోందని, సాయంత్రానికి పూర్తి ఫలితాలు వెలువడే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు తెలిపారు.

ఫిబ్రవరిలో రెండో దశ జనగణన



టీమీడియా , అక్టోబర్ 28 , హైదరాబాద్ బ్యూరో:
జనాభా లెక్కల సేకరణలో కీలకమైన రెండో దశకు తెలంగాణలో రంగం సిద్ధమైంది. తద్వారా రాష్ట్రంలోని ప్రజలందరి వ్యక్తిగత వివరాల సేకరణకు రాష్ట్ర జనాభా లెక్కల విభాగం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా 80 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు యాప్‌లో వివరాల సేకరణపై నిపుణులతో ట్రైనింగ్ ఇస్తోంది.వాస్తవంగా రెండో దశను ప్రయోగాత్మకంగా 3 జిల్లాల్లో చేయాలని భావించారు. ఆ జిల్లాలు భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సంగారెడ్డిగా ఉన్నాయి. ఈ జిల్లాల్లోని ఒక్కో మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద రెండో దశ జనగణన చేపట్టాలని తొలుత ప్రతిపాదించినప్పటికీ, ఉత్తర భారతంలో ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో రెండో దశ ప్రారంభమైనందున పైలట్ ప్రాజెక్టులు వద్దని కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

తెలంగాణలో సుమారు 4.30 కోట్ల జనాభా

తెలంగాణలో తొలి దశ కింద గత మే, జూన్ నెలల్లో ప్రతి కుటుంబానికి సంబంధించిన యజమాని వివరాలు మాత్రమే సేకరించారు. ఈ ప్రకారం రాష్ట్రంలో మొత్తం కోటీ 10 లక్షల కుటుంబాలున్నట్లు అంచనా వేశారు. ఆయా కుటుంబాల్లో సుమారు 4.30 కోట్ల జనాభా ఉన్నట్లు భావిస్తున్నారు. రెండో దశలో చేపట్టబోయే జనగణనలో కుటుంబ సభ్యులందరి వ్యక్తిగత వివరాలు సేకరించనున్నారు. ఆ ప్రకారం ఒక్కో పౌరుడి నుంచి దాదాపు 40 ప్రశ్నలకు సమాధానాలు సేకరించి, లెక్కల సిబ్బంది యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

ఈ జనగణనలో కీలకమైనవి కులం వివరాలు. స్వాతంత్ర్యానంతరం నుంచి పౌరులందరి కులం వివరాలు నమోదు చేయడం ఇదే మొట్ట మొదటిసారి. అందుకే ఆయా వివరాలు బయటికి రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోనున్నారు. గణకుల ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసిన యాప్‌లో పౌరుల వివరాలు నమోదు చేసి, సబ్మిట్ చేయగానే సమాచారం మొత్తం కేంద్ర హోంశాఖ సర్వర్‌లోకి వెళ్లేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు అత్యంత గోప్యత పాటించాలని కేంద్ర హోంశాఖ ఇప్పటికే అన్ని రాష్ట్రాల జనాభా లెక్కల డిపార్ట్?మెంట్లకు ఆదేశాలు జారీ చేసింది.

తొలి దశ జనగణనలో రాష్ట్రవ్యాప్తంగా 80 వేల మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఆ దశలో ఒక్కో గణకుడికి కొన్నిచోట్ల 1,500 మంది జనాభా వివరాలను సేకరించే బాధ్యతలను అప్పగించారు. రెండో దశలో ఒక్కో గణకుడి పరిధిలో 800 జనాభా మించకుండా కేటాయించాలని రాష్ట్ర జనాభా లెక్కల డిపార్ట్?మెంట్? భావిస్తోంది. దీంతో మలి దశకు మరో ఐదారు వేల మంది సిబ్బంది అదనంగా అవసరం అవుతారని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

రబీ సాగుపై ఎల్‌నినో పంజా!

● 59 శాతం పడిపోయిన గోధుమల సాగు

టీ మీడియా , , అక్టోబర్ 28 న్యూస్ డెస్క్:
వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం దేశ వ్యవసాయ రంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ పంటలపై ప్రభావం చూపిన వాతావరణ పరిస్థితులు ఇప్పుడు రబీ సాగుపైనా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు పేర్కొంటున్న గణాంకాల నేపథ్యంలో నేలలో తేమ తగ్గడం, సాగునీటి లభ్యతపై అనిశ్చితి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఫలితంగా గోధుమలు, శనగలు సహా పలు పంటల సాగు విస్తీర్ణం తగ్గినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ గణాంకాలు సూచిస్తున్నాయి.

సగానికిపైగా తగ్గిన గోధుమల సాగు

దేశంలో సాధారణంగా అక్టోబర్ నుంచి నవంబర్ వరకు గోధుమల విత్తనాలు వేస్తారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో పంట కోతకు వస్తుంది. అయితే 2026--27 రబీ సీజన్‌లో అక్టోబర్ 23 నాటికి నమోదైన సాగు విస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే గణనీయంగా తగ్గినట్లు నివేదిక వెల్లడిస్తోంది.2025--26 సీజన్‌లో ఇదే సమయానికి దేశవ్యాప్తంగా 0.27 లక్షల హెక్టార్లలో గోధుమల సాగు నమోదు కాగా, ప్రస్తుత సీజన్‌లో 0.11 లక్షల హెక్టార్లకే పరిమితమైంది. దీంతో దాదాపు 59 శాతం క్షీణత నమోదైంది. గోధుమలతో పాటు శనగల సాగు కూడా తగ్గింది. గత ఏడాది అక్టోబర్ 23 నాటికి 3.77 లక్షల హెక్టార్లలో శనగలు సాగు చేయగా, ఈ ఏడాది 2.21 లక్షల హెక్టార్లలోనే సాగు నమోదైంది.పప్పుధాన్యాలు, నూనెగింజల సాగు విస్తీర్ణం తగ్గడం కొనసాగితే భవిష్యత్తులో వ్యవసాయ ఉత్పత్తులు, మార్కెట్ సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

రాజస్థాన్‌లో 58 శాతం క్షీణత

రబీ పంటల సాగు తగ్గుదల రాజస్థాన్‌లో మరింత స్పష్టంగా కనిపిస్తోంది. గోధుమలు, ఆవాలు, బార్లీ, శనగలు తదితర పంటలు కలిపి గత ఏడాది అక్టోబర్ 23 నాటికి 14.13 లక్షల హెక్టార్లలో సాగు నమోదైంది. ఈ ఏడాది అదే సమయానికి సాగు విస్తీర్ణం 5.93 లక్షల హెక్టార్లకు పడిపోయింది.దీంతో సుమారు 8.21 లక్షల హెక్టార్ల మేర సాగు తగ్గినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఇది దాదాపు 58 శాతం క్షీణతకు సమానం. తమిళనాడులోనూ రబీ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గినట్లు సమాచారం. ఉత్తరప్రదేశ్‌లో స్వల్ప ప్రభావం కనిపించగా, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోనూ సాగు నమోదు పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. కేరళలో గత ఏడాది 0.14 లక్షల హెక్టార్లతో పోలిస్తే ఈసారి 0.11 లక్షల హెక్టార్లలో సాగు నమోదైంది.